# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.**
4. **తెలంగాణలోని కామారెడ్డి వరద బాధితులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ‘‘మన్ కీ బాత్’’ మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

=========================

పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రుణ వ్యవధిని 2024 డిసెంబర్ 31 తర్వాతి కాలానికి పొడిగించాలని తీసుకున్న నిర్ణయాలకు సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. దీంతో రుణ వ్యవధిని 2030 మార్చి 31 వరకు పొడిగించారు. పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణ ద్వారా 50 లక్షల మంది కొత్త లబ్ధిదారులు సహా మొత్తం ఒక కోటి 15 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. గృహనిర్మాణం పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

--------------------------

విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. విజయవాడ సితార సెంటర్‌లో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల మహా గణపతిని ముఖ్యమంత్రి నిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో ప్రజలంతా ఘనంగా నిర్వహించే అతిపెద్ద పండుగ వినాయకచవితి అని అన్నారు. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..37 సెకన్లు

-------------------------------

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాత భవనాలల్లో ఉన్నవారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళం, పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు.

వాగులు, కాలువలు పొంగి పొర్లుతుండడంతో కాజ్ వేలు కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించే ప్రాంతాల్లో రాకపోకలను నిషేదించాలన్నారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లతో ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

-------------------------------

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు వద్ద అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు ఒక ప్రకటనలో సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. వర్షాల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిన సందర్భాల్లో తక్షణమే స్పందించి ప్రమాదాలను నివారించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.

-------------------------------

ప్రపంచ దేశాల సుస్థిర అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర కీలకమని తెలుపుతూ ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించింది. సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్థిరమైన జీవనోపాధి సృష్టించడానికి వారి ఆర్థిక అభివృద్ధికి సహకార వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుంది. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ వ్యవస్థను గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ర్యాలీలు, సమావేశాలు, మారథాన్ లు నిర్వహిస్తున్నాయి. సహకార వ్యవస్థ ద్వారా జరిగే సమాజాభివృద్ధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్యోద్దేశం.

-------------------------------

2030 కామన్‌వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు భారత్ వేయాలనుకుంటున్న బిడ్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం నిన్న ఆమోదించింది. 2030 కామన్‌వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు భారత ఒలింపిక్ అసోషియేషన్ గత ఏడాది మార్చిలోనే ఇంట్రెస్ట్ ఆఫ్ హోస్టింగ్ అంటూ లెటర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఈ మేరకు క్రీడాశాఖ ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం అంగీకరించింది. ప్రపంచస్థాయి క్రీడా మైదానం, శిక్షణా సదుపాయాలు కలిగిన గుజరాత్ లోని అహ్మదాబాద్ సరైన వేదిక అని పేర్కొంది.

-------------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కాణిపాకంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిన్న అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 16 వరకూ జరగనున్నాయి. నిన్న రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి సమర్పించారు. అనంతరం కాణిపాకం దేవస్థానంలో నూతన అన్నదాన ప్రసాద భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని ప్రధాన దేవాలయాల పాలకవర్గాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 5 వేల 250 ఆలయాలకు దూప దీప నైవేద్యం అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడిస్తూ..

..వాయిస్... 33 సెకన్లు

---------------------------

తెలంగాణలోని కామారెడ్డి వరద బాధితులు అధైర్యపడవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కామారెడ్డి వరద బాధితులను పరామర్శించి అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. వరదలో చిక్కుకున్న బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడినట్లు కేంద్రమంత్రి తెలుపుతూ..

వాయిస్..29 సెకన్లు

---------------------------

దేశంలో బ్యాంకింగ్ సౌకర్యం లేని వారిని ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి చేర్చే లక్ష్యంతో ప్రారంభించిన అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకం ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన- పీఎంజేడీ. సామాన్యులను అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశ్యంతో 2014 ఆగస్టు 28న, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభించారు. అతిపెద్ద ఆర్థిక సమగ్రత పథకంగా జన్ ధన్ యోజన గుర్తింపు పొందింది. దేశ వ్యాప్తంగా 56.16 కోట్ల బ్యాంక్ ఖాతాలు ఉండగా.. అందులో 56 శాతం మహిళా ఖాతాదారులు ఉన్నారు.

ఈరోజుతో జన్ ధన్ యోజన 11 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దాని సరిహద్దు ఒడిశా తీర ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

======================